## సీతారామ పంప్‌హౌస్‌ను పరిశీలించిన కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వీ పాటిల్

అశ్వాపురం, ఆగస్టు 14: మండల పరిధిలోని బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్టు పంపుహౌస్‌ను కలెక్టర్ జితేష్ వీ పాటిల్ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. గురువారం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతులమీదుగా పంపుహౌస్‌ను ప్రారంభించనుండడంతో అక్కడి పనులకు సంబంధించి ఏర్పాట్లను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సీతారామ ప్రాజెక్టు అధికారులు ఉన్నారు.

## విష జ్వరాలను అరికట్టాలి

టేకులపల్లి, ఆగస్టు 14: గ్రామాల్లో వ్యాపిస్తున్న విష జ్వరాలను అరికట్టాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల కమిటీ ఆధ్వర్యంలో సులానగర్ పీహెచ్‌సీ వైద్యాధికారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మండలంలో వైరల్ జ్వరాలు వ్యాపిస్తున్నాయని, గ్రామాల్లో దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, శానిటేషన్ పనులు చేయించాలని కోరారు. కార్యక్రమంలో డి.ప్రసాద్, గుగులోత్ రాంచందర్ పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాలకు రోడ్డు మరమ్మతులు

టేకులపల్లి, ఆగస్టు 14: మండలంలోని కొప్పురాయి-బర్లగూడెం రహదారికి మరమ్మతు చేయించాలని బర్లగూడెం, జంగాలపల్లి గ్రామస్తులు ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు గతంలో విన్నవించారు. స్పందించిన ఆయన రహదారి మరమ్మతులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. బుధవారం రహదారి మరమ్మతు పనులను ఎమ్మెల్యే సోదరుడు కోరం సురేందర్ దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో నాయకులు మోకాళ్ల పోషాలు, గణేష్, భూక్యా సర్దార్, రవి, చందర్‌సింగ్, మోహన్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

టేకులపల్లి, ఆగస్టు 14: రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలుంటాయని సివిల్ సప్లై డీటీ జి.ప్రభాకర్‌రావు అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన మండలస్థాయి రేషన్ డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు సకాలంలో రేషన్‌బియ్యం అందాలని, అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఊకే శేఖర్‌రావు, సంతు, దుర్గారావు, రామ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం

ఆళ్ళపల్లి, ఆగస్టు 14: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో పనిచేసి బదిలీపై వెళ్తున్న సిబ్బందికి వైద్యులు, సిబ్బంది బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారికి పుష్పగుచ్ఛాలు ఇచ్చి శాలువతో సన్మానించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు రేవంత్, సంఘమిత్ర, సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## వైభవంగా రామయ్యకు నిత్యకల్యాణం

బూర్గంపహాడ్(భద్రాచలం), ఆగస్టు 14: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో సీతారాముల నిత్యకల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. అర్చకులు తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామివారికి సుప్రభాతం పలికి, ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్యహోమాలు, నిత్యబలిహరణ తదితర పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం స్వామివారికి కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న జంటలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

## పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ఇల్లెందు రూరల్, ఆగస్టు 14: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు లోహిత, కవిత, ప్రియాంక అన్నారు. బుధవారం మండల పరిధిలోని కొమరారం, రొంపేడు ప్రాంతాలకు చెందిన బాలాజీ తండా, దనియాలపాడు, హనుమంతులపాడు, మొండితోగు, ఇందిరానగర్, సంజయ్‌నగర్, సుదిమల్ల, రాగబోయిన గూడెం పంచాయతీల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న రోగుల వద్ద నుంచి రక్తపూతలు సేకరించి మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరాల్లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## పంద్రాగస్టుకు ప్రగతిమైదాన్‌లో 'కసరత్తు'

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 14: పంద్రాగస్టుని పురస్కరించుకుని ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు నేతృత్వంలో ఏఆర్ పోలీసులు కొత్తగూడెం ప్రగతి మైదాన్‌లో కసరత్తు చేశారు. స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాకు వచ్చే అతిథులు మంత్రి, కలెక్టర్, ఎస్పీలకు స్వాగతాలు పలకడం, అనంతరం పరేడ్ నిర్వహించడం వంటి పలు ప్రదర్శన అంశాలపై కసరత్తు చేశారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన


ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 14: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు ఏర్పాట్లను పరిశీలించారు. ముల్కలపల్లి మండలం పూసుగూడెం వద్ద హెలీప్యాడ్, పంపుహౌజ్, డెలివరీ పాయింట్‌తో పాటు ఇతర పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ రోహిత్ రాజు పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (ఆపరేషన్స్) పరితోష్ పంకజ్, పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్, ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వాల్ పోస్టర్ ఆవిష్కరణ

కొత్తగూడెం టౌన్, ఆగస్టు 14: ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 'ఓబీసీ అడ్వకేట్స్ కన్వెన్షన్'కు సంబంధించిన వాల్ పోస్టర్లను బుధవారం జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆవిష్కరించారు. ఈ నెల 25న హైదరాబాద్‌లో జరుగనున్న ఈ కన్వెన్షన్‌ను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గాజుల రామ్మూర్తి, సూరెడ్డి రమణారెడ్డి, కటకం పుల్లయ్య, కిషన్‌రావు, జనపరెడ్డి గోపీకృష్ణ, రావిలాల రామారావు, సింగు ఉపేందర్, కర్నెకంటి శ్రీధర్ పాల్గొన్నారు.

## సీఎం స్పష్టమైన హామీ ఇవ్వాలి

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 14: సీతారామ ప్రాజెక్టు ద్వారా జిల్లాకు రావాల్సిన నీటి వాటాపై గురువారం సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ప్రకటించాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు డిమాండ్ చేశారు. సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు కాసాని ఐలయ్య, ముత్యాల విశ్వనాథం, జాటోత్ కృష్ణ, నాగేశ్వరరావు, ఐక్లా నాయక్ బుధవారం స్థానిక మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

# 5 బెడ్లపై 13 మందికి వైద్యం

**చంద్రుగొండ ఆసుపత్రిలో జ్వరపీడితుల కిటకిట**
**నీరసించి వైద్యశాల బల్లలపై పడుకుంటున్న రోగులు**


స్టాఫ్ నర్సు చుట్టూ ఉన్న జ్వరపీడితులు


చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒకే బెడ్‌పై ఇద్దరు చొప్పున చికిత్స పొందుతున్న రోగులు

చంద్రుగొండ, ఆగస్టు 14 : చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో దయనీయ దృశ్యాలు కన్పిస్తున్నాయి. జ్వర పీడితులతో ఈ ఆసుపత్రి కిటకిటలాడుతోంది. ఈ ఆసుపత్రిలో ఉన్న ఐదు బెడ్లపై బుధవారం 13 మందికి చికిత్స అందిస్తున్నారంటే పరిస్థితి ఎంతటి హృద్యంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. బెడ్లు లేని కారణంగా చాలామంది రోగులకు వైద్యులు తాత్కాలిక ట్రీట్‌మెంట్ అందించి మందులు ఇచ్చి పంపుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో గమనించొచ్చు. ఆసుపత్రికి రోగులు పోటెత్తుతుండడం, వైద్యుడు పరీక్షించేంత వరకూ క్యూలో నిలుచోవాల్సి రావడం, అప్పటికే జ్వరంతో నీరసంగా ఉన్న రోగులు అంతసేపు వరుసలో నిలుచోలేకపోవడం వంటి దృశ్యాలు కన్పిస్తున్నాయి. ఇంకొంతమంది రోగులైతే మరింత నీరసంగా ఉండి ఆసుపత్రి ఆవరణలోని బల్లల పైనా, చెట్ల కింద, వరండాలో పడుకుంటున్నారు. జ్వర పీడితులు అధిక సంఖ్యలో వస్తున్న ఈ సీజన్‌లో ఈ ఆసుపత్రిలో రక్త పరీక్షలు చేయడానికి కనీసం ల్యాబ్ టెక్నీషియన్ లేడు. అయితే, జిల్లాస్థాయిలో మీటింగ్ ఉన్నందున ఈ రోజు ల్యాబ్ పనిచేయడంలేదని ఈ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ తనూజ సమాధానమిచ్చారు. అలాగే, సీజనల్ వ్యాధులు, జ్వరాలతో రోగులు అధిక సంఖ్యలో వస్తున్న ఈ తరుణంలో ఈ ఆసుపత్రిలో తగినన్ని ఔషధాలు కూడా లేకపోవడం గమనార్హం.

# అధ్వానంగా శ్మశాన దారి

**బురదలో అవస్థలు పడుతూనే దహన సంస్కారాలు**
**బురద రోడ్డు బాగు చేయాలని గ్రామస్తుల డిమాండ్**

దుమ్ముగూడెం, ఆగస్టు 14 : అనారోగ్యంతో మృతిచెందిన ఓ మహిళ మృతదేహాన్ని మోకాలి లోతు బురద రోడ్డుపై అవస్థలు పడుతూ శ్మశాన వాటికకు తరలించారు నందులచెలక గ్రామస్తులు. ఈ దృశ్యం బుధవారం 'నమస్తే తెలంగాణ' కంటపడింది. వివరాల్లోకి వెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెం మండలం నడికుడి పచాయతీ పరిధిలోని నందులచెలక గ్రామానికి చెందిన సోయం రామమ్మ బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. మాజీ ఎంపీటీసీ సోడె తిరుపతిరావు ఆధ్వర్యంలో గ్రామస్తులు అడుగు తీసి అడుగు వేయలేని బురద రోడ్డు మీదుగా అవస్థలు పడుతూ మృతదేహాన్ని ఎలాగోలా శ్మశాన వాటికకు తరలించారు. కాగా.. ఈ రోడ్డు గురించి పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.


మృతదేహాన్ని బురద రోడ్డులో మోసుకుని శ్మశాన వాటికకు తీసుకెళ్తున్న గ్రామస్తులు

## ఎరువుల కొరత లేకుండా చూడాలి

**ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య**

ఇల్లెందు రూరల్, ఆగస్టు 14: రైతులకు ఎరువుల కొరత లేకుండా చూడాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. బుధవారం ఇల్లెందు మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం శాఖ నూతనంగా నిర్మించిన గోదామును ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మండలంలో వ్యవసాయ సాగు ముమ్మరంగా చేపట్టారని, రైతులకు ఎరువల కొరత లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ రవి, మాజీ ఎంపీపీ చీమల నాగరత్నమ్మ, మాజీ వైస్ ఎంపీపీ మండల రాము, నాయకులు పులి సైదులు, ఆరెం కిరణ్, పోలేపల్లి నాగేశ్వరరావు, దనియాకుల బాబు, కిన్నెర నర్సయ్య, రావుల రమేష్, రాము, శ్రీను, కొమరయ్య, వెంకటేశ్వర్లు, లష్కర్, కోటయ్య పాల్గొన్నారు.

## రుణమాఫీ రైతులకు తిరిగి రుణాలు అందజేయాలి

**ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు**

దుమ్ముగూడెం, ఆగస్టు 14 : ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తున్న నేపథ్యంలో రుణమాఫీ అయిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం దుమ్ముగూడెంలోని సొసైటీ కార్యాలయ ఆవరణలో రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తొలివిడతలో 1220 మందికి రూ.3.92కోట్ల మేరకు రుణమాఫీ జరిగిందని, రెండోవిడతలో 769 మందికి రూ.3.81కోట్లు రుణమాఫీ జరిగిందన్నారు. అనంతరం దుమ్ముగూడెం జూనియర్ కళాశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు కిలిమి ఎల్లారెడ్డి, ఏజీఎం ప్రవీణ్, సీఈవో బిందు, మేనేజర్ సీహెచ్.త్రిమూర్తులు, సిబ్బంది గంగరాజు, మాజీ జడ్పీటీసీ తెల్లం సీతమ్మ, సీఐ అశోక్, డైరెక్టర్లు శ్రీనుబాబు, బొల్లి వెంకట్రావు, కలువ పూర్ణయ్య, మట్టా శివాజీ, రంజిత్‌కుమార్, తోట రమేశ్, శోభన్ పాల్గొన్నారు.

## మీసేవా నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు

దుమ్ముగూడెం, ఆగస్టు 14 : మండల కేంద్రమైన లక్ష్మీనగరంలోని మీసేవా కేంద్రాన్ని తహసీల్దార్ అశోక్‌కుమార్ బుధవారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మీసేవా నిర్వాహకులు వినియోగదారుల నుంచి నిబంధనలకు విరుద్ధంగా ధరలు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, ధరల పట్టికను మీసేవా కేంద్రం ఎదుట ప్రదర్శించాలని, మీసేవాలో సీజనల్ వ్యాధుల నేపథ్యంలో వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని నిర్వాహకులను ఆదేశించారు. తాగునీటి సౌకర్యం ఉండాలని, ధరల పట్టికను ఖచ్చితంగా కేంద్రం ఎదుట ఉంచాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నీవు లేక నేను లేను..

**భర్త మరణాన్ని తట్టుకోలేక గుండెపోటుతో భార్య మృతి**
**మణుగూరు బాలాజీనగర్‌లో విషాద ఛాయలు**

మణుగూరు టౌన్, ఆగస్టు 14 : పొలం పనులకు వెళ్లిన భర్త గుండెపోటుతో విగతజీవిగా మారాడు. భర్త లేడని తెలుసుకున్న భార్య గుండె బరువెక్కింది. 'నీవు లేక నేనెందుకు' అనుకుందేమో.. భర్తతోపాటు ఆమె గుండెపోటుతో తనువు చాలించింది. ఈ విషాద ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్‌లో నివాసం ఉండే రిటైర్డ్ సింగరేణి కార్మికుడు కొమ్ము సోమయ్య(72), శంకరమ్మ(65) భార్యాభర్తలు. వారికి ముగ్గురు పిల్లలు. ఈ క్రమంలో సోమయ్య రోజూ మాదిరిగా చాకలి ఐలమ్మ నగర్ సమీపంలోని తన పొలం వద్దకు వెళ్లాడు. పనులు చేస్తుండగా ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందాడు. గమనించిన తోటి రైతులు అతడి మృతదేహాన్ని ఇంటికి తరలించారు. భర్త మృతదేహాన్ని చూసిన శంకరమ్మ షాక్‌కు గురై గుండెపోటుతో అక్కడికక్కడే తనువు చాలించింది. భార్యాభర్తల మృతితో మణుగూరులో విషాద ఛాయలు నెలకొన్నాయి. సోమయ్య, శంకరమ్మ దంపతులకు ముగ్గురు పిల్లలుకాగా.. ఒకరు ఖమ్మంలో, మరో ఇద్దరు హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మణుగూరు పోలీసులు మృతుల వివరాలు సేకరించారు. కాగా.. మృతి చెందిన దంపతులకు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు నివాళులర్పించారు.

# ఇల్లెందు ఏరియాలో సీఎండీ విస్తృత పర్యటన


జీకే 5 ఓసీని పరిశీలిస్తున్న సీఎండీ

ఇల్లెందు రూరల్, ఆగస్టు 14: ఇల్లెందు ఏరియాలో సింగరేణి సీఎండీ ఎన్.బలరాం విస్తృతంగా పర్యటించారు. ముందుగా జీఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించి ఇల్లెందు ఏరియా ఉత్పత్తి, ఉత్పాదకత వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీకే 5 ఓసీ విస్తరణ కోసం అన్ని అనుమతులు త్వరలోనే వస్తాయని, ప్రాజెక్టు పనులు ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. నూతనంగా నిర్మించనున్న పంపు స్టోరేజ్, పవర్ ప్లాంట్ ప్రాంతాన్ని పరిశీలించి సాధ్యాసాధ్యాలపై సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జేకే ఓసీ వ్యూ పాయింట్ నుంచి అక్కడ జరుగుతున్న బొగ్గు ఉత్పత్తి వివరాలను ఏరియా జీఎం జాన్ ఆనంద్‌ను అడిగి తెలుసుకున్నారు. సంస్థ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించాలని అన్నారు. అనంతరం సింగరేణి వైద్యశాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో అధికారులు సుభానీ, జానకీరాం, కేవీ రావు, సుజాత, జాన్ ఆనంద్, వెంకటేశ్వర్లు, మోహన్‌రావు పాల్గొన్నారు.

### ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

ఇల్లెందు రూరల్, ఆగస్టు 14: ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సింగరేణి సీఎండీ బలరాం అన్నారు. బుధవారం ఇల్లెందు పర్యటనలో భాగంగా సింగరేణి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. సింగరేణి వ్యాప్తంగా వచ్చే విద్యా సంవత్సరం నుంచి సీబీఎస్ సిలబస్ పాఠశాలలను ప్రారంభిస్తామని అన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న విద్యా ప్రతిభను ఎప్పటికప్పుడు తెలుసుకొని వారికి అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని సూచించారు. ఆయన వెంట జీఎం కో ఆర్డినేషన్ సుభాని, జీఎం సోలార్ జానకీరాం, ఎస్‌వోటూ డైరెక్టర్ కేవీ రావు, సీఎంవో సుజాత, ఏరియా ఎస్‌వోటు జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, అధికారులు జీవీ మోహన్‌రావు పాల్గొన్నారు.

# ఆశ్రమ విద్యార్థులతో మార్చ్‌పాస్ట్ రిహార్సల్

బూర్గంపహాడ్ (భద్రాచలం), ఆగస్టు 14: ఐటీడీఏ కార్యాలయంలో గురువారం జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా వివిధ పాఠశాలల నుంచి వచ్చిన గిరిజన విద్యార్థులకు బుధవారం మార్చ్‌ఫాస్ట్ రిహార్సల్ నిర్వహించినట్లు ఐటీడీఏ డీడీ మణెమ్మ తెలిపారు. విద్యార్థులు చేసిన రిహార్సల్స్‌ను ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ చలపతి, ఎన్‌సీసీ శిక్షకుడు తారాచంద్, పీడీలు నాగులు, నాగేశ్వరరావు, పార్వతి, విద్యార్థులు పాల్గొన్నారు.


రిహార్సల్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ డీడీ మణెమ్మ

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా ఉండాలి : ఐటీడీఏ ఏపీవో జనరల్

ఐటీడీఏ ఆవరణలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ అధికారులకు ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్ స్పష్టం చేశారు. బుధవారం వారితో ఏర్పాట్లకు సంబంధించి సమావేశం నిర్వహించారు. జెండా ఆవిష్కరణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో ఉద్యానవనాధికారి ఉదయ్ కుమార్, టీఏ శ్రీనివాస్, అకౌంటెంట్ కరీం, మేనేజర్ ఆదినారాయణ, చిట్టిబాబు పాల్గొన్నారు.

## కిన్నెరసాని నుంచి 7వేల క్యూసెక్కులు విడుదల

పాల్వంచ, ఆగస్టు 14: కిన్నెరసాని ప్రాజెక్టు నుంచి బుధవారం రాత్రి 7 వేల క్యూసెక్కుల నీటిని డ్యామ్‌సైట్ అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 407 అడుగులు కాగా బుధవారం రాత్రి 405.5 అడుగులు. ఇన్‌ఫ్లో 500 క్యూసెక్కులు ఉండడంతో డ్యామ్ సైట్ అధికారులు రెండు గేట్ల ద్వారా 7 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 14: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై యాకూబ్ అలీ అన్నారు. బుధవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సైబర్ నేరాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసులు రామారావు, రమేష్, రమణ ఉన్నారు.

## మోటర్ చోరీ

కొత్తగూడెం క్రైం, ఆగస్టు 14: రోడ్డు నిర్మాణ పనులు చేపట్టే మిక్సర్ మోటర్ చోరీకి గురైన ఘటన బుధవారం పట్టణంలో వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి.. జిల్లా ఎస్పీ కార్యాలయానికి సమీపంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఎప్పటిలానే కాంట్రాక్టర్ మిక్సర్ మిషన్‌ను పనులు జరుగుతున్న ప్రాంతంలో ఉంచి వెళ్లారు. ఉదయం వచ్చి చూడగా మిక్సర్ మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. సదరు కాంట్రాక్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

## మద్యం మత్తులో సామగ్రి ధ్వంసం

పాల్వంచ, ఆగస్టు 14: మద్యం మత్తులో ఎదురింట్లో ఉన్న సామన్లను ధ్వంసం చేసిన ఘటన మండలంలోని నాగారం కాలనీలో బుధవారం చోటు చేసుకుంది. నాగారం కాలనీకి చెందిన తేజావత్ సుమన్ తాపీ పనులు చేస్తుంటాడు. బుధవారం మద్యం తాగి వచ్చి ఎదురింట్లో ఉంటున్న బానోత్ శైలజ ఇంటికి వెళ్లి సామన్లు చిందర వందరచేసి వారి కుటుంబ సభ్యులను దుర్భాషలాడుతూ చంపుతానని బెదిరించాడు. సదరు మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## ఉపాధ్యాయుడికి స్వల్ప గాయాలు

ఆళ్లపల్లి, ఆగస్టు 14: అతి వేగంతో వచ్చిన ఆర్టీసీ బస్సు కొత్తగూడెం నుంచి మర్కోడు వస్తుండగా ఓ ఉపాధ్యాయుడికి బుధవారం తృటిలో ప్రాణపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న వెంకటేశ్వర్లు పాఠశాల అనంతరం ఇంటికి వెళ్తుండగా మండల కేంద్రంలోని శాంతి విద్యానికేతన్ సమీపంలో మూలమలుపు వద్ద కొత్తగూడెం నుంచి మర్కోడుకు వస్తున్న ఆర్టీసీ బస్సు అతి వేగంతో దుసుకురావడంతో రహదారి పక్కన ఉన్న గోతిలో పడ్డాడు. స్థానికులు ఉపాధ్యాయుడిని పీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స అందించారు.

## ముగ్గురిపై కేసు నమోదు

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 14: వరిచేనును ధ్వంసం చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై యాకుబ్ ఆలీ బుధవారం తెలిపారు. మండల పరిధిలోని జమ్మిగూడెనికి చెందిన రైతు మారుతి విశ్వనాథానికి మద్దికొండ(భీమునిగూడెం) గ్రామ సమీపంలో ఉన్న వ్యవసాయ భూమిలో వరి సాగు చేస్తున్నాడు. కొద్ది రోజుల క్రితం దమ్మపేట మండలం మొద్దులగూడెం గ్రామానికి చెందిన బలుసు రామకృష్ణ, దొడ్డా శ్రీరామ్మూర్తి, దొడ్డా సింధు కలిసి వరి పంటను దున్నించి ధ్వంసం చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

## కోయభాషా ప్రణాళిక కార్యాచరణ శిక్షణకు హాజరుకావాలి

**ఐటీడీఏ పీవోకు కమిటీ బాధ్యుల ఆహ్వానం**

బూర్గంపహాడ్, ఆగస్టు 14: ఈ నెల 18వ తేదీన మండలంలోని కోయగూడెం రైతువేదికలో కోయభాషా ప్రణాళిక కార్యాచరణ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి రావాలని ఆర్గనైజింగ్ కమిటీ సభ్యుడు రాజేంద్రకుమార్ బుధవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ఐటీడీఏ పీవోకు ఆహ్వానపత్రిక అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు తిరుపతమ్మ, రమాదేవి, కుమారి, భారతి పాల్గొన్నారు.

## రుణమాఫీ నగదు పంపిణీ

చంద్రుగొండ, ఆగస్టు 14: రుణమాఫీ నగదును రైతులు పంట పెట్టుబడి అవసరాలకు వినియోగించుకోవాలని గానుగపాడు సొసైటీ చైర్మన్ చెవుల చందర్‌రావు అన్నారు. బుధవారం సొసైటీ కార్యాలయంలో రెండు విడతల్లో 336 మంది రూ.1.30 కోట్ల రుణమాఫీ అయిన నగదును అయన రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ సెక్రెటరీ లంక నరసింహారావు, సొసైటీ వైస్ చైర్మన్ భూపతి ధనలక్ష్మి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

## కృష్ణవేణి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 14: అక్రమ పద్ధతుల్లో విద్యాసంస్థలను నిర్వహిస్తూ విద్యార్థులను మోసం చేస్తున్న కృష్ణవేణి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి కాంపాటి పృథ్వీ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ నోడల్ అధికారి వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు శివప్రశాంత్, బాలాజీ తదితరులు ఉన్నారు.

## విద్యాహక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కొత్తగూడెం ఎడ్యుకేషన్, ఆగస్టు 14: విద్యా హక్కు చట్టం-2009ను పటిష్టంగా అమలు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రా కామేష్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విద్యను వ్యాపారంగా మారుస్తూ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలో యూనిఫామ్స్, పుస్తకాలు అమ్ముతూ విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, నరేష్, వీరునాయక్, దిలీప్ పాల్గొన్నారు.

## పాస్టర్లకు నిత్యావసరాలు పంపిణీ


నిత్యావసర సరుకులు అందిస్తున్న బాధ్యులు

సారపాక, ఆగస్టు 14: సికింద్రాబాద్‌కు చెందిన షిలోహు మిషనరీ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గోదావరి వరద ముంపు ప్రాంతాలైన వీఆర్ పురం, కూనవరం, బూర్గంపహాడ్, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు చెందిన 50 మంది పాస్టర్లకు రూ.2.5లక్షల విలువైన బియ్యం, నిత్యావసర సరుకులు మినిస్ట్రీస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మోజెస్ ములక బుధవారం అందజేశారు. ములకలపల్లి మండలం మూకమామిడిలో అంధత్వంతో బాధపడుతున్న సమూయేలు, దావీదుకు జీవనోపాధి నిమిత్తం ఒక్కొక్కరికి 15వేలు అందజేశారు. కార్యక్రమంలో బృందం పాస్టర్ టీఎస్ జాషువా, పాస్టర్ డి.పెద్దారావు, పాస్టర్ టి.మహిమకుమార్, ఇమ్మానుయేల్, ఎం.చరణ్ పాల్గొన్నారు.

## వ్యవసాయంలో నూతన ఒరవడి అలవర్చుకోవాలి

అశ్వారావుపేట రూరల్, ఆగస్టు 14: వ్యవసాయంలో రైతులు నూతన పద్ధతులు అవలంభించాలని ప్రొ.జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం అసోసియేట్ డీన్ హేమంత్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని దత్తత గ్రామాలైన నారాయణపురంలో ఆయిల్ పాం, వరి, మిరప నర్సరీలను పరిశీలించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ పావని మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించే విధానాన్ని రైతులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు గోపాలకృష్ణ, శ్రీలత, ఆర్ మహేష్, జీవన్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు షాకిరాభాను, చిన్నంశెట్టి వాసు, రాంబాబు, రాము పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 14: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ కేంద్రంలోని మండల విద్యావనరుల కార్యాలయంలో కోఆర్డినేటర్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. సీత, నాగదుర్గ, చిలకమ్మ, విజయకుమారి, కనకదుర్గ, పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఓబీసీ మోర్చా సభ్యుడిగా మణికంఠ

అశ్వారావుపేట టౌన్, ఆగస్టు 14: భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యుడిగా అశ్వారావుపేటకు చెందిన తాళం మణికంఠ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు.

## 'ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చాలి'

గుండాల, ఆగస్టు 14: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఎన్నో వాగ్దానాలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, అధికారంలోకి వచ్చాక వాగ్దానాలను విస్మరించిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు విమర్శించారు. వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ ప్రచురించిన గోడపత్రికలను బుధవారం కాచనపల్లి గ్రామంలో ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య, నాయిని రాజు మాట్లాడుతూ.. వాగ్దానాలు నెరవేర్చాలని కోరుతూ ఆగస్టు 22న హైదరాబాద్ ఇందిరా పార్కులో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బుర్ర వెంకన్న, ఈసం శంకర్, కొమరం శాంతయ్య, మాచర్ల సత్యం, బోస్, వాంకుడోత్ అజయ్, బుర్ర రాఘవులు, అజ్మీర బిచ్చ, పాయం వెంకన్న, బొర్ర వెంకన్న, యానగంటి గణేష్, సూసం నారాయణ, కల్తి సోమయ్య పాల్గొన్నారు.

## 'సఫాయి కాక.. సఫాయి దీదీ' కార్యక్రమం

సారపాక, ఆగస్టు 14: బూర్గంపహాడ్ మండలంతో పాటు అశ్వాపురం, దుమ్ముగూడెం మండలాల్లో 8 గ్రామ పంచాయతీల్లో 'సఫాయి కాక.. సఫాయి దీదీ' కార్యక్రమంలో భాగంగా 300 మంది పారిశుధ్య కార్మికులకు పాఠశాల విద్యార్థినులు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. సంస్థ సీసీ రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు చేసే పనుల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే వాష్ ప్రోగ్రాం సిబ్బంది రాజ్‌కుమార్, ప్రసాద్, సునీల్, సందీప్, వెంకట్, వెంకట్రావు, ముత్యాలరావు, వెంకటేశ్వరరావు, ప్రమోద్, సాంబ, అపర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

## పాలనలో ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాం..

కరకగూడెం, ఆగస్టు 14: ప్రజలకు అండగా నిలిచినప్పుడే ప్రజాప్రతినిధులకు సమాజంలో గుర్తింపు ఉంటుందని ఎంపీపీ రేగా కాళీక అన్నారు. బుధవారం మండల పరిధిలోని భట్టుపల్లి రైతువేదిక భవనంలో ఐదేళ్లు పదవీకాలం పూర్తయిన పాలకవర్గాన్ని, బదిలీపై వెళ్లిన కన్నాయిగూడెం, రేగళ్ల, తుమ్మలగూడెం పంచాయతీ కార్యదర్శులు తరుణ్, శ్రీకాంత్, మధుకు మండల పరిషత్ అధికారులు, కార్యదర్శుల ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ ప్రత్యేక అధికారి దినేష్‌కుమార్, ఎంపీడీవో కుమార్, సిబ్బంది శాలువాతో వారిని సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పలు పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.